నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 బుధవారం 26 జూన్ 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## మీసేవ నిర్వాహకులకు షోకాజ్ నోటీసులివ్వాలి

హాజీపూర్, జూన్ 25 : జిల్లాలో ఆరు నెలలుగా ప్రజలకు సేవలందించకుండా మూసి ఉంచిన 17 మీ సేవ కేంద్రాల నిర్వాహకులకు కలెక్టర్ కుమార్ దీపక్ షోకాజ్ నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. బెల్లంపల్లి మండలంలో 3, దండేపల్లి మండలంలో 1, జన్నారంలో 1, కాసిపేటలో 1, కోటపల్లిలో 2, లక్షేటిపేటలో 2, మంచిర్యాలలో 1, మందమర్రిలో 1, నస్పూర్‌లో 2, నెన్నెలలో 2, చెన్నూర్‌లో 1 మీ సేవ కేంద్రాలు మూసి ఉండడంతో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కొత్తగా మీ సేవ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

## రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్**

కోటపల్లి, జూన్ 25 : వర్షాకాలంలో రవాణాకు ఇబ్బందుల్లేకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులకు సూచించారు. కోటపల్లి మండలంలో అటవీ అనుమతులు లేక నిలిచిపోయిన బబ్బెరచెలుక–రాజారం, పారుపల్లి–కావర కొత్తపల్లి, నక్కలపల్లి గ్రామానికి వెళ్లే రహదారులను పరిశీలించారు. వర్షాలు కురిస్తే అనారోగ్యంతో ఉన్నవారు, గర్భిణులు ముందుగానే రవాణా సౌకర్యం కలిగి ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లాలని సూచించారు. ఎంపీడీవో ఆకుల భూమయ్య, పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, మద్ది శివకృష్ణ ఉన్నారు.



కోటపల్లి మండలం నక్కలపల్లి రోడ్డును పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎంపీడీవో భూమయ్య

# పదెకరాల్లోపు భరోసా ఇవ్వాలి

## ప్రభుత్వ ఉద్యోగులకు పథకం వర్తింపజేయవద్దు

- రేషన్ కార్డు నిబంధన సరికాదు ● కౌలు రైతులకు.. యజమానికి సమానంగా డబ్బులు పంపిణీ చేయాలి ● కేసీఆర్ సర్కారు మాదిరిగానే సకాలంలో జమ చేయాలి
- మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్‌లో అభిప్రాయాలు వెల్లడించిన అన్నదాతలు ● ఆయాచోట్ల పట్టుమని పదిమంది కూడా హాజరుకాని వైనం ● సిర్పూర్(టీ)లో మంత్రి మాట్లాడుతుండగా మూడుసార్లు పవర్‌కట్



ఆసిఫాబాద్ రైతు వేదికలో నిర్వహించిన అభిప్రాయ సేకరణకు హాజరైన రైతులు



లక్షెట్టిపేట రైతు వేదికలో ..

మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, జూన్ 25 (నమస్తే తెలంగాణ ) :'అర్హులందరికీ రైతు భరోసా ఇవ్వాలి. నిబంధనల పేరిట ఇబ్బందులకు గురిచేయవద్దు. పదెకరాల్లోపు పథకం వర్తింపజేయాలి. అసైన్డ్ పట్టాలున్న వారికి కూడా అమలు చేయాలి. ముఖ్యంగా తెల్ల రేషన్ కార్డు నిబంధనను తొలగించాలి. ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వద్దు. కొంతమంది పట్టాదారులు వ్యవసాయ భూమిని కౌలుకు ఇస్తున్నరు. కౌలు రైతుకు, యజమానికి సమానంగా డబ్బులు పంపిణీ చేయాలి. కేసీఆర్ సర్కారు మాదిరిగానే సకాలంలో ఖాతాల్లో జమ చేయాలి. వానకాలం పంటలకు మే–లో, యాసంగి పంటలకు అక్టోబర్‌లో అందించాలి. రైతు బీమా పథకానికి అర్హుల వయసు 75 ఏళ్లకు పెంచాలి.' అంటూ రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మంగళవారం పలు రైతు వేదికల్లో రైతుభరోసా పథకంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులు, రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, కర్షకులు పై విధంగా స్పందించారు.

### అనుకూలంగా మాట్లాడే వారి..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్, సిర్పూర్–టీ, మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేట, లక్షెట్టిపేట రైతు వేదికల్లో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నామమాత్రంగా సాగింది. ఆయా చోట్ల పట్టుమని పది మంది రైతులు కూడా హాజరు కాలేదు. అధికారులే ఎక్కువ సంఖ్యలో కనిపించారు. పైగా ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడే రైతుల నుంచి మాత్రమే అభిప్రాయ సేకరణ చేపట్టారు. మిగిలిన వారి అభిప్రాయాలను పేపర్‌లో రాసివ్వాలని చెప్పడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేమీ వైఖరి అంటూ అసహనం వ్యక్తం చేసి వెళ్లిపోయారు.

### మంత్రి మాట్లాడుతుండగానే పవర్ కట్

సిర్పూర్(టీ) మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతుండగానే మూడుసార్లు పవర్ కట్ అయ్యింది. ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి మాట్లాడుతుండగా ఐదు.. పది నిమిషాల వ్యవధిలో మూడుసార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేశారు.

### పదెకరాల్లోపు వర్తింపజేయాలి

*లక్షెట్టిపేట, జూన్ 25 :* పదెకరాల్లోపు రైతు భరోసా పథకం వర్తింపజేయాలి. అట్లాగే సాగు చేసే రైతులకు మాత్రమే డబ్బులివ్వాలి. కొంతమంది పట్టాదారులు తమకున్న వ్యవసాయ భూమిని కౌలుకు ఇస్తున్నరు. కౌలుకు చేసే రైతుకు యజమానే ఇవ్వాలి. లేదంటే ఇద్దరికీ సమానంగా డబ్బులు పంచాలి. ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీని వెంటనే చేస్తేనే బాగుంటుంది.



**- ఎంబడి సత్యనారాయణ, రెబ్బన్‌పల్లి, దండేపల్లి మండలం**

### కౌలు రైతులకూ డబ్బులివ్వాలి

*చెన్నూర్ రూరల్, జూన్ 25 :* కేసీఆర్ సర్కారు రైతుబంధు ఇచ్చినట్లే రైతు భరోసా అందించాలి. రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులేయాలి. సొంత భూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు కౌలు రైతులకు కూడా రైతుభరోసా డబ్బులిచ్చి ఆదుకోవాలి. ఐదెకరాలకే పరిమితం కాకుండా పదెకరాల వరకూ రైతు భరోసా పథకం వర్తింపజేయాలి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం డబ్బులు చెల్లించాలి.



**- దేవనేన మల్లమ్మ, బుద్ధారం, చెన్నూర్**

### రైతులకు మాత్రమే..

*లక్షెట్టిపేట, జూన్ 25 :* సాగు చేసే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి. బీడు భూములు, రియల్టర్లు వేసే వెంచర్లకు రైతు భరోసా ఇవ్వద్దు. అట్లా ఇవ్వడం వల్ల ప్రభుత్వం తీవ్రంగా నష్టపోతుంది. గతంలో డిజిటల్ పాస్ పుస్తకం ఉన్న ప్రతి రైతుకూ డబ్బులిచ్చారు. ఆ పద్ధతి మారాలి. పక్కాగా సర్వే చేసి సాగు చేస్తున్న రైతులకు న్యాయం చేయాలి.



**- ఇండ్ల చిన్నయ్య, రైతు, జెండావెంకటాపూర్**

### ఆంక్షలు లేకుండా రైతుభరోసా ఇవ్వాలి



ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతు భరోసా ఇవ్వాలి. గతంలో ప్రభుత్వం అందించిన విధంగా సకాలంలో రైతు భరోసా డబ్బులివ్వాలి. కొత్త నిబంధనల పేరిట రైతులను ఇబ్బందులకు గురిచేసేలా ఆంక్షలు విధించడం ఏమాత్రం సరికాదు. పదెకరాల్లోపు సాగులో ఉన్న రైతులందరికీ రైతు భరోసా అందించాలి. ఏజెన్సీ ప్రాంత రైతులకు కూడా డబ్బులివ్వాల్సిందే. రైతులు వడ్డీలకు అప్పులు తెచ్చుకొని పంటలు వేసుకున్నాక రైతు భరోసా ఇస్తే ఏం లాభం.

**-సీహెచ్ పెంటు, ఇట్యాల**

### రైతు బీమా అర్హత వయసు పెంచాలి



ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని సక్రమంగా అమలు చేయడంతో పాటు రైతు బీమా పథకానికి అర్హత వయసు పెంచాలి. ప్రస్తుతం 60 ఏళ్లు ఉన్న ఈ నిబంధనను 75 ఏళ్ల వరకు పెంచాలి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన రైతులు 80 ఏళ్లు వచ్చినా వ్యవసాయం చేస్తూనే ఉంటారు. ఇలాంటి వారు ప్రమాదవశాత్తు చనిపోతే కుటుంబానికి భరోసా ఇవ్వాలి.

**- హెక్టు, అంకుసాపూర్, సిర్పూర్(టీ)**

### నిబంధనల పేరిట ఆలస్యం వద్దు



రైతు భరోసా ఏడాదికి రెండు సార్లు సకాలంలో అందించాలి. వర్షాకాలం పంటలకు సంబంధించిన డబ్బులు మేలో, యాసంగి పంటలకు సంబంధించిన డబ్బులు అక్టోబర్‌లో ఇవ్వాలి. విడుతల వారీగా కాకుండా రైతులందరికీ ఒకేసారి అందించాలి. ఇలా అందిస్తేనే రైతులకు ఆ డబ్బులు ఉపయోగపడుతాయి. ప్రభుత్వం నిబంధనల పేరిట ఆసల్యం చేస్తే రైతులు అప్పులపాలు కావాల్సి వస్తుంది.

**-టేకం కొండు, మాలన్‌గొంది**

### అలా అయితే వ్యవసాయం చేయలేం



రైతుల అభిప్రాయ సేకరణ పేరుతో రైతుభరోసా పథకంలో కోత విధించాలని ప్రయత్నించడం సరికాదు. ఇలా అయితే వ్యవసాయం చేసే పరిస్థితులుండవు. ఇప్పటికే రైతుబంధు డబ్బులు సకాలంలో అందక అప్పులపాలు కావాల్సి వచ్చింది. అప్పులు చేసి పంటలు వేసుకున్నాక రైతుభరోసా డబ్బులిస్తే అవి వడ్డీలకే సరిపోతాయి. ఉద్యోగులకు రైతు భరోసా ఇవ్వకపోయినా పరువాలేదు. రైతులకు మాత్రం సకాలంలో డబ్బులివ్వాలి.

**- ఆత్రం మగ్గ, మాలన్‌గొంది**

# మమత సొసైటీ కాంప్లెక్స్ వద్ద హైడ్రామా

- నామినేషన్లు అందించేందుకు వెళ్తే కనిపించని అధికారి ● 12 గంటలైనా రాని వైనం ● బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం
- తీరిగ్గా వచ్చి మమత సూపర్ బజార్ ఎన్నికలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన రిటర్నింగ్ అధికారి ● ఓటమి భయంతోనేనన్న బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాల అర్బన్, జూన్ 25 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మమత సూపర్ బజార్ కాంప్లెక్స్‌లోని సహకార సంఘ కార్యాలయం వద్ద మంగళవారం హైడ్రామా కనిపించింది. మమత సూపర్ బజార్ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు నామినేషన్ పత్రాలు సమర్పించడానికి వెళ్లగా, 12 గంటలైనా అక్కడ అధికారులెవ్వరూ లేకపోవడంతో వారు ఆశ్చర్యపోయారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు అక్కడికి చేరుకోగా, ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం సాగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వారిని సముదాయించే యత్నం చేశారు. ఈ లోగా రిటర్నింగ్ అధికారి సందీప్ కార్యాలయానికి చేరుకొని ఎన్నికలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించి సంబంధిత జీవోను నోటీస్‌బోర్డులో అతికించారు. అనంతరం పోలీసులు ఇరు పార్టీల నాయకులను అక్కడి నుంచి పంపించేశారు.



నాయకులను బయటకు పంపిస్తున్న పోలీసులు

### ఓడిపోతారనే భయంతోనే రద్దు

మమత సూపర్ బజార్ సహకార సంఘం ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఓడిపోతుందనే భయంతోనే రద్దు చేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. 19న సహకార సంఘం ఎన్నికల సంఘానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందన్నారు. 173 మంది సభ్యులున్న సహకార సంఘం ఎన్నికలు రద్దు చేయడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందని వారు ఆరోపించారు. ఈ నెల 24, 25, 26 తేదీల్లో నామినేషన్లు అందించవచ్చని, బీఆర్ఎస్ బలపరుస్తున్న తొమ్మిది మంది అభ్యర్థులతో నామినేషన్ పత్రాలు అందజేయడానికి వచ్చామన్నారు. ఉదయం 11 గంటలకు రావాల్సిన అధికారి అందుబాటులో లేరని, ఫోన్ చేసినా స్పందించలేదని, గంటన్నర తర్వాత కలెక్టర్ కార్యాలయం నుంచి ఫోన్ రావడంతో ఇక్కడికి వచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యబద్ధంగా కొనసాగుతున్న సహకార సంఘ ఎన్నికలు నిర్వహించేందుకు ధైర్యంగా ముందుకు రావాలని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, మమత సొసైటీ మాజీ చైర్మన్ ఎర్రం తిరుపతి ఉన్నారు.

### ఎన్నికల ప్రక్రియ నిలిపివేత

**- రిటర్నింగ్ అధికారి సందీప్‌కుమార్**

మమత సొసైటీకి సంబంధించిన ఎన్నికలు ప్రక్రియను నిలిపివేసినట్లు రిటర్నింగ్ అధికారి సందీప్ కుమార్ మంగళవారం తెలిపారు. స్టేట్ కో ఆపరేటివ్ అథారిటీ ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. మొదటి రోజు నామినేషన్లు ఏమి రాలేదని, రెండో రోజు నామినేషన్ రోజున ఎలక్షన్లు రద్దు చేయాలని రాష్ట్ర సహకార ఎన్నికల అధికారి నుంచి ఆదేశాలు రావడంతో ఎన్నికలు నిలివేస్తున్నట్లు వెల్లడించారు. తదుపరి ఆదేశాల మేరకు ఈ ఎన్నికల ప్రక్రియ ఉంటుందన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

**ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు**

కౌటాల/చింతలమానేపల్లి/సిర్పూర్(టీ)/ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూన్ 25 : ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్ఐ మధుకర్, సిబ్బందితో మాట్లాడారు. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో భూముల విషయంలో గొడవలు జరిగే అవకాశం ఉందని, సమస్య పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పొగాకు, గుట్కా, గంజాయి, దేశీదారు, మట్కా, ఆన్‌లైన్ గేమ్‌లు ఆడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే చింతలమానేపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దని సూచించారు. సిర్పూర్(టీ) స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, కౌటాల సీఐ సాధిక్‌పాషా, ఎస్బీ సీఐ రాణా ప్రతాప్, ఎస్ఐలు నరేశ్, దీకొండ రమేశ్ ఉన్నారు.



కౌటాల పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

### సత్వర న్యాయం అందించాలి

జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భరోసా సెంటర్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ డీ.వీ శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో భరోసా సెంటర్ సిబ్బంది ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ రమేశ్, ఎస్ఐ ఓబులమ్మ, లీగల్ అడ్వైజర్ శైలజ, రజిత, విజయలక్ష్మి ఉన్నారు.

### అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీ.వీ శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అక్రమంగా గంజాయి, నకిలీ పత్తి విత్తనాలు, నిషేధిత గుట్కా తరలిస్తూ 8712670505 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

## మొక్కలు సిద్ధం చేయాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, జూన్ 25 : త్వరలో చేపట్టబోయే వజ్రోత్సవ వనమహోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని నర్సరీని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్‌తో కలిసి పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న మొక్కల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, విత్తనాలు పెట్టినప్పుడు తప్పనిసరిగా నీళ్లు చల్లాలని, కలుపు మొక్కలు మొదట్లోనే గుర్తించి తొలగించాలని సూచించారు. మొక్కల ఎదుగుదలకు జీవామృతం తగిన సమయంలో అందించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలను సంరక్షించి ఆహ్లాదాన్ని పంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీఎల్‌పీవో ఒమర్ హుస్సేన్, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# బాలిక కుటుంబాన్ని ఆదుకోవాలి

**బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్**

దహెగాం, జూన్ 25 : మానవ మృగాల చేతిలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో కామాంధుడి చేతిలో బలైన బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ త్వరగా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కంటి తుడుపు చర్యగా రూ 2.50 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంటే కుదరదని, రూ. 10 లక్షలతో పాటు ఐదెకరాల భూమి పంపిణీ చేయాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఖర్జీలో ఇటీవల విద్యుత్ షాక్‌తో గాయపడ్డ రాకేశ్‌ను పరిమర్శించారు. అనంతరం గిరివెల్లి, ఒడ్డుగూడ తదితర గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ కార్యకర్తలను కలుసుకున్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు షాకీర్,నాయకులు ఎల్కరి ప్రశాంత్, వెల్మలె గులాబ్, అంజీ, సురేశ్, శ్రీకాంత్, నారాయణ , తదితరులు పాల్గొన్నారు.



బాలిక కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

### వైద్య సిబ్బందిని నియమించాలి

కాగజ్‌నగర్, జూన్ 25 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సామాజిక ప్రభుత్వ దవాఖానలో పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎల్లాగౌడ్ తోట సామాజికి ప్రభుత్వ దవాఖానను ఆయన సందర్శించారు. సమస్యలు తెలుసుకొని వైద్యుల కొరత ఉన్నట్లు గుర్తించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ఆయాచోట్ల పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది నియమించాలన్నారు. వైద్యుడైన సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు హాస్పిటల్స్‌లో ఎలాంటి సదుపాయాలు ఉండాలో తెలియదా అని ప్రశ్నించారు. అంతేగాకుండా దవాఖానలో అందించే భోజనం సైతం నాసిరకంగా ఉందని ఆరోపించారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం
మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679